సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



భారీ చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

విశాఖ శీలానగర్‌లో జూలై 13న జరిగిన దొంగతనం కేసును నగర క్రైం పోలీసులు ఛేదించారు.
10లో



రైలులో లగేజీ భారం

ఇకపై రైలు ప్రయాణంలో మీ లగేజీ.. మీకు మరింత భారమవ్వనుంది.
10లో



ఉచిత బస్సుకోసం పాట్లు..ఫీట్లు

ఫ్రీ బస్ ఎక్కేందుకు మహిళలు క్యూ కట్టారు..రద్దీలో బస్సెక్కడానికి పాట్లు పడ్డారు.
10లో

సొమ్మొకరిది... సోకొకరిది..!

- ఆర్‌ఈసీఎస్ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాల పై ఈపీడీసీఎల్ శీతకన్ను
- ఆర్‌ఈసీఎస్ కార్యకలాపాలు చేతికి వచ్చాక సంస్థ ఆస్తులు, మిగులు నిధులపై ఈపీడీసీఎల్ పెత్తనం
- రూ.కోట్ల ఆదాయం తీసుకుంటూ కళాశాల నిర్వహణ గాలికి..
- ఏడు నెలలుగా సిబ్బందికి జీతాలు చెల్లించని వైనం
- కూటమి ప్రభుత్వం వచ్చాక మొదలైన కష్టాలు
- ఆర్‌ఈసీఎస్ పునరుద్ధరణ హామీకి తూట్లు




కశింకోటలో గల ఆర్‌ఈసీఎస్ -పాలిటెక్నిక్ కళాశాల, విద్యార్థులు

సాక్షి, అనకాపల్లి :

కశింకోటలో గల ఆర్‌ఈసీఎస్ సంస్థకు సంబంధించి రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఆర్‌ఈసీఎస్ పరిధిలో గల ఐదు మండలాల వినియోగదారుల బకాయిల చెల్లింపులు కోట్ల రూపాయలు ఏపీఈపీడీసీఎల్ బ్యాంక్ ఖాతాలో ఉన్నాయి.

ఆదాయం ఏపీఈపీడీసీఎల్ ఖాతాకు..

2021 సెప్టెంబర్ నుంచి 2025 మే వరకూ మధ్యకాలంలో విద్యుత్ వినిమయ బిల్లుల బకాయిల చెల్లింపులు రూ.574.32 కోట్ల ఆదాయం రాగా ..సిబ్బంది జీతాలు, రికరింగ్, నాన్ రికరింగ్ ఖర్చుల చెల్లింపు నిమిత్తం రూ.171.35 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన 402.96 కోట్ల నగదును ఈపీఆర్‌సీ బ్యాంకు ఖాతాలో జమచేయాల్సి ఉంది. కానీ ఏపీఈపీడీసీఎల్ వారి ఖాతాలలో జమ చేసుకున్నారు. సంస్థ ఆస్తులు అప్పులపై హక్కు, అధికారం వినియోగదారులది. సంస్థకు రూ.వందల కోట్లు ఆస్తులు ఉన్నాయి. కానీ ఏపీఈఆర్‌సీ వారి ఆదేశాలకు విరుద్ధంగా మిగులు నిధులను, సంస్థ పంపిణీ వ్యవస్థను, కార్యాలయాలను, ఉద్యోగులను వాడుకుని వ్యాపారం చేసుకుంటూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న ఏపీఈపీడీసీఎల్, కళాశాల నిర్వహణ బాధ్యత మాత్రం తీసుకోవడం లేదంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఆర్‌ఈసీఎస్ విలీన ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగలేదు..సంస్థ కార్యకలాపాల వరకే అప్పగించాలని ఏపీఈఆర్‌సీ ఆదేశించింది. సంస్థ ఆస్తుల, అప్పుల సెటిల్‌మెంట్ జరిగే వరకు ఆ సంస్థ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణ బాధ్యత ఈపీఆర్‌సీ ఆదాయంతోనే చూసుకోవాలని స్పష్టంగా ఉంది. ఏపీఈఆర్‌సీ వారి ఆదేశాల మేరకు ఆర్‌ఈసీఎస్ సంస్థకు విద్యుత్ పంపిణీ కార్యక్రమాలకు లైసెన్స్ లేని కారణంగా ఆస్తులు, అప్పుల సెటిల్మెంట్‌ను పెండింగ్‌లో ఉంచి సంస్థ కార్యకలాపాలను ఏపీఈపీడీసీఎల్ వారిని తక్షణం స్వాధీనం చేసుకోవాలని జారీ చేసింది. కానీ ఏపీఈఆర్‌సీ వారి ఆదేశాలకు విరుద్ధంగా ఆర్‌ఈసీఎస్ సంస్థకు సంబంధించి సుమారు 2 కోట్ల రూపాయల మిగులు నిధులను, రూ. 6.5 కోట్ల విలువ గల స్టోర్స్ మెటీరియల్‌ను ఏపీఈపీడీసీఎల్ వారు స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటుగా కళాశాల మిగులు నిధులు సుమారు రూ.2.28 కోట్ల రూపాయలను కూడా స్వాధీన పరుచుకున్నారు. ఉద్యోగులను, కార్యాలయాలను వాడుకుంటూ వ్యాపారం చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సంస్థ కళాశాల పూర్తి బాధ్యతను మాత్రం తీసుకోవడం లేదు. 16 ఏళ్లుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడిచిన ఈ కళాశాలకు కూటమి ప్రభుత్వంలో ఆటంకం ఏర్పడింది. కళాశాల సిబ్బందికి సుమారు ఏడాదిగా జీతాలు లేవు..కళాశాల నిర్వహణ బాధ్యత ఏపీఈపీడీసీఎల్ తీసుకోకుండా ఆర్‌ఈసీఎస్ ఆదాయాన్ని మాత్రం లాగేసుకుంటున్నది. ఆర్‌ఈసీఎస్ బకాయిలు చెల్లింపులు, ఆదాయం మొత్తం సొంతం చేసుకుంటూ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణ బాధ్యతను, అందులో పనిచేసే సిబ్బందికి జీతాలు చెల్లింపులను పట్టించుకోవడం లేదంటూ కళాశాల సిబ్బంది, విద్యార్థులు వాపోతున్నారు.

ఆర్‌ఈసీఎస్ నేపథ్యమిదీ...

అనకాపల్లి జిల్లాలో ఐదు మండలాల పరిధిలో గల గ్రామాల్లో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపార అవసరాల నిమిత్తం 50 ఏళ్ల క్రితమే విద్యుత్ సరఫరా కార్యకలాపాలను ప్రారంభించిన అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ(ఆర్‌ఈసీఎస్) వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేస్తూ లాభాల బాటలో పయనించింది. అన్ని రంగాలలో కలిపి ఆర్‌ఈసీఎస్ సంస్థకు సుమారు 2 లక్షల పైచిలుకు వినియోగదారులు ఉన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో వినియోగదారుల పిల్లలకు సాంకేతిక విద్యను అందించాలనే దూరదృష్టితో డిప్లొమా కోర్సులతో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2008లో సెప్టెంబర్‌లో వినియోగదారులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి కశింకోటలో రాజీవ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. కళాశాలకు సంస్థ ప్రధాన కార్యాలయంలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించడమే కాకుండా కళాశాల నిర్వహణ బాధ్యత, ఉద్యోగుల జీతభత్యాలు, భవన నిర్మాణాలు, ప్రయోగ పరికరాల కొనుగోలు, ఇతర నిర్వహణ ఖర్చులు ఆర్‌ఈసీఎస్ నిధుల నుంచి చెల్లించాలని తీర్మానం చేశారు. సంస్థ బైలాను కూడా సవరించి 2009లో రాజీవ్‌గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారు.

వినియోగదారుల పిల్లలకు సగం సీట్లను కేటాయించాలని నిర్ణయించారు. ఆర్‌ఈసీఎస్ యాజమాన్యం కల్పించిన మౌలిక సదుపాయాలతో 120 మంది విద్యార్థులతో కళాశాల ప్రారంభమై అనతి కాలంలోనే 720 మంది విద్యార్థులకు విద్య అందించే స్థాయికి ఎదిగింది. ఇప్పటివరకూ వేలాది మంది విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించి స్థిరపడేలా కృషి చేసింది. .

పలుమార్లు వినతి..

స్థానిక కూటమి ఎమ్మెల్యేకు, ఏపీఈపీడీసీఎల్‌కు, జిల్లా కలెక్టర్‌కు కళాశాల సిబ్బంది పలుమార్లు వినతి ఇచ్చినా ఫలితం లేకపోయింది. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లే ఉంటున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీజీపీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఇంతవరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోనే...

ఏపీఈపీడీసీఎల్ సంస్థ పంపిణీ వ్యవస్థను, ఉద్యోగులను, కార్యాలయాలను వాడుకుంటూ వ్యాపారం చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ వారు ఆర్‌ఈసీఎస్ సంస్థ రికరింగ్, నాన్-రికరింగ్ ఖర్చులను చెల్లిస్తున్నారు .కానీ..కళాశాల రికరింగ్, నాన్-రికరింగ్ ఖర్చులను భరించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి సిబ్బందికి జీతాలు లేవు. ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించినా వాటితో కళాశాల నిర్వహణ నడిచేది. కానీ 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు ప్రభుత్వం ఫీజురియింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. దీంతో వినియోగదారులు పిల్లలు (విద్యార్థుల) భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది.

ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో సిబ్బంది :	51 మంది
వీరిలో బోధనా సిబ్బంది :	38
బోధనేతర సిబ్బంది :	13
జీతాల ఖర్చు నెలకు :	రూ. 13 లక్షలు
కళాశాల నిర్వహణ వ్యయం :	రూ.2- రూ.3 లక్షలు
ఏడు నెలల జీతం బకాయిలు :	రూ.91 లక్షలు

విలీన ప్రక్రియ ప్రారంభం నుంచి కూడా విద్యార్థుల చెల్లించే ఫీజు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులతోనే పాలిటెక్నిక్ కళాశాల నడిపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2 కోట్ల వరకు విడుదల చేయకపోవడంతో కళాశాలలో జీతాలు ఇవ్వడం కూడా కష్టంగా మారింది.

న్యూస్‌రీల్

హెచ్‌సీ కుమార్తెకు కారుణ్య నియామకం



కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇటీవల మృతి చెందిన డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు కుమార్తె శిరీషకు జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ హోదాలో కారుణ్య నియామక పత్రంను గురువారం తమ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం పట్ల అంకితభావం, నిజాయితీతో కృషి చేస్తూ కుటుంబానికి, పోలీస్ శాఖకు గౌరవం తీసుకురావాలని కోరారు.

చిన్నారులపై వీధికుక్కల దాడి

- ముగ్గురికి గాయాలు

మాడుగుల రూరల్: మండలంలో సాగరం పాత గ్రామంలో వీధి కుక్కలు దాడి చేసి ముగ్గురిని గాయపరిచాయి. వీరిలో వంజువంజుల దక్షిత్ అనే చిన్నారిని గురువారం కుక్కలు గాయపర్చడంతో మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు రామకుమార్ ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రికి తరలించారు. ఈ చిన్నారితో పాటు వంజువంజుల అచ్చియ్యమ్మ, లకే గీతికాశ్రీ అనే చిన్నారి కుక్కల దాడిలో గాయపడ్డారు. వారిని మాడుగుల ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.

కడప స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థి సాత్విక్

నక్కపల్లి : మండలకేంద్రంలో గల బీఎస్ హాకీ క్లబ్‌లో తర్ఫీదు పొందుతూ స్థానిక గురూస్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న కర్రి సాత్విక్ కడప డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కి ఎంపికైనట్టు డిస్ట్రిక్ట్ స్పోర్ట్ అథారిటీ అధికారి ఎల్.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జూలై 9న అనకాపల్లి డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా స్థాయిలో జరిగిన సెలక్షన్స్‌లోనూ, గత జూలై 21న రాష్ట్ర స్థాయిలో జరిగిన సెలక్షన్స్‌లోనూ సాత్విక్ ప్రతిభ కనబరచడంతో స్పోర్ట్ స్కూల్‌కి ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా బీఎస్ హాకీ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షుడు చిన అప్పారావు, కోచ్ రాంబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, సీనియర్ క్రీడాకారుడు, గాజుల రామచంద్రరావు, రిజత్, కొల్నాటి నానాజీ తదితరులు సాత్విక్‌ను అభినందించారు.

గణపతి మండపాలకు అనుమతులు తప్పనిసరి

- ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలో ఈనెల 27 నుంచి వినాయక చవితి పండగను పురస్కరించుకుని గణపతి మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసు అనుమతులు తీసుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులకు ఎటువంటి చలానాలు చెల్లించవలసిన అవసరం లేదన్నారు.

సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు..

గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా httpr://ganeshutsav.net క్లిక్ చేసి అనుమతులు పొందాలని, గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనం కోసం అనుమతులు సులభంగా పొందవచ్చని తెలిపారు.

దరఖాస్తు ఇలా.. : వెబ్‌సైట్‌లోకి వెళ్లి న్యూ అప్లికేషన్ క్లిక్ చేసి, మొబైల్ నంబర్ ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుందని తెలిపారు.

నమోదు చేయాల్సిన వివరాలు..

దరఖాస్తుదారు పేరు, మొబైల్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్/కమిటీ పేరు, గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు. ఏ సబ్ డివిజన్, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, గణేష్ నిమజ్జనం తేదీ, సమయం, వాహన వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తు సమర్పణ అనంతరం సంబంధిత పోలీసులు ప్రాంగణాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు.


మానవత్వం పరిమళించిన వేళ...




రోడ్డు పక్కన ఉన్నప్పుడు, ఆశ్రమానికి తరలించిన తరువాత వృద్ధుడి ఫొటో

తుమ్మపాల : నిరాశ్రయుడిగా కంపుకొడుతున్న దుస్తులతో రోడ్డు పక్కన నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడికి కశింకోటలో గల కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఆశ్రమం సిబ్బంది సపర్యాలు చేసి ఆ వృద్ధుడి రూపురేఖలే మార్చేశారు. వివరాలివి. ఒక వృద్ధుడు కొంతకాలంగా మండలంలో రేబాక జంక్షన్‌లో గల అండర్‌బ్రిడ్జి కింద ఒంటరిగా చింకి దుస్తులతో నడవలేని స్థితిలో ఫుట్‌పాత్‌పై ఉంటున్నాడు. దేక్కుంటూ వెళ్లి అటుగా రాకపోకలు సాగించేవారు అందించే ఆహారంతో సరిపెట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఆ వృద్ధుడి దుస్థితి గమనించి అతనిని ఆశ్రమానికి తరలించేందుకు ఆశ్రమం ఇంచార్జి ఆశాజ్యోతి కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారు. ఆమె ప్రయత్నానికి రేబాక పంచాయతీ కార్యదర్శి వి.ఈశ్వరరావు తోడవడంతో ఈ నెల 20న ఆశ్రమం సిబ్బందికి పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తోడ్పాటు అందించి ఆ వృద్ధుడిని ఆశ్రమానికి తరలించారు. దగ్గరకు వెళ్తే దుర్వాసన వస్తున్న స్థితిలో ఉన్న ఆ వృద్ధుడికి ఆశ్రమం సిబ్బంది గురువారం సపర్యలు చేసి అతని రూపురేఖలే మార్చేసారు. అతనికి ఆశ్రమంలో ప్రత్యేక వసతి కల్పించి మెరుగైన సేవలు అందిస్తున్నారు. నడవలేని స్థితిలో ఉన్న అతనికి వైద్య పరీక్షలు చేయించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఆశ్రమం ఇన్‌చార్జి ఆశాజ్యోతి తెలిపారు.

చినుకులా రాలి... గలగలా పారి...



పాల నురగలతో పరుగులు తీస్తున్న జలపాతం

దీపించెం జలరాశి ఘోష కడు నుద్రేకించి గీతంబు లాలాపించెన్..అంటూ ఓ మహాకవి వర్ణించినట్టుగా..చినుకు చినుకు కలిసి జలరాశిగా మారి జలపాతమై హోరెత్తిస్తున్న ఈ రమణీయ దృశ్యాలు ధారమఠం వద్ద అబ్బురపరిచాయి... పర్యాటకులు ఈ జలపాతాల సోయగాలకు మంత్ర ముగ్ధులవుతున్నారు..

-గొలుగొండ



జారుడుబల్ల వద్ద గలగలా జలపాతం పరవళ్లు

ఉప్పుగల్లీల భూములపై పరిశ్రమల పడగ

- వాటిని ఏపీఐఐసీకి బదలాయించాలని ప్రభుత్వం నోటీసులు
- ససేమిరా అంటున్న పంచాయతీ
- బదలాయిస్తే పూడిమడకకు ముప్పు
- ఇప్పటికే ఉప్పుటేరు కలుషితం



పూడిమడకలో తయారు చేసిన మిలమిలలాడే ఉప్పు(ఫైల్)

అచ్యుతాపురం: గంగ పుత్రులకు కొత్త కష్టమొచ్చింది. వేటకు వెళ్లినా గతంలో వలే మత్స్య సంపద దొరకక, వేట కోసం సముద్రంలో సుదూర ప్రాంతాలకు వెళ్లే మత్స్యకార కుటుంబీకులకు మరో వనరుగా ఉప్పు గల్లీలు ఉండేవి. నాలుగు శివారు గ్రామాలుండే పూడిమడకకు ఒక వైపు పూర్తిగా సముద్రం, రెండు వైపులా ఉప్పుగల్లీలు, ఉప్పుటేరు ఉన్నాయి. అచ్యుతాపురం సెజ్ కేంద్రంగా ఇప్పటికే భూములు సేకరించిన ప్రభుత్వం ఇప్పుడు పూడిమడకకు ఆనుకొని ఉన్న ఉప్పుగల్లీలుగా ఉపయోగించే భూముల్ని బదలాయింపు చేసి ఏపీఐఐసీకి అప్పగించే పనికి ఉపక్రమించడంతో పూడిమడక ఉనికికే తీవ్ర ప్రమాదం ఏర్పడింది. అలాగని వేలాది మంది గల పూడిమడకను తరలించే అవకాశాలు కూడా క్లిష్టమే. ఇప్పటికే ఉపాధి దెబ్బతిని ఇక్కడ ఉండలేక, మరో చోటకి వెళ్ల లేక మత్స్యకారులు నానా అవస్థలు పడుతున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వ నిర్ణయం మరింత శరాఘాతం కానుంది.

పూడిమడక ఉనికికే ప్రమాదం..?

పూడిమడక గ్రామం ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో అతి పెద్ద జాలరి పల్లి. వేలాది మంది మత్స్యకారులు ఉండే ఈ గ్రామానికి ఎంతో విశిష్టత ఉంది. నాలుగు ప్రధాన శివారు గ్రామాలుగా ఉన్న పూడిమడకలో ఉండే లైట్ హౌస్ ద్వారా మత్స్యకారులకు సముద్రంలో వేటకు వెళ్లేటప్పుడు దిక్కులు తెలిపే సూచనలు ఉన్నాయి. సంప్రదాయ బద్ధంగా మత్స్యకారులు ఉన్న ఈ గ్రామంలో ఉప్పు పంట సైతం ప్రధాన వృత్తిగా ఉంటూ స్థానికులకు ఉపాధినిచ్చేది. సముద్రపు ఆటు పోటులు, ఉప్పుటేరు ద్వారా నీటి రాకపోకలతో ఎంతో ప్రశాంతంగా ఉండే పూడిమడకకు అచ్యుతాపురం సెజ్ వచ్చాక కష్టాలు మొదలయ్యాయి. కొంత మంది వేటను వదిలి సమీప కంపెనీల్లో కూలీలుగా మారారు. కంపెనీలతో పాటు బ్రాండిక్స్ పైప్‌లైన్‌ల వల్ల సముద్రం కలుషితమై మత్స్య సంపద తగ్గిపోయింది. ఉప్పుటేరులోకి రసాయనాలు రావడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీనికితోడు ఫిషింగ్ హార్బర్ కోసం చేపట్టిన అస్తవ్యస్త పనులు ఉప్పుటేరు రూపురేఖల్ని మార్చేశాయి. కుచించుకుపోయిన ఉప్పుటేరు చూసి తల్లడిల్లుతున్న గ్రామస్తులకు వరదనీటి ముప్పు (సముద్రంలో నీరు పెరిగినప్పుడు ఉప్పుటేరు ద్వారా వచ్చే వరద) నుంచి రక్షణగా ఉండే ఉప్పు గల్లీల భూములనూ పరిశ్రమల కోసం బదలాయించాలని భావిస్తుండడం కొత్త ప్రమాదం తెచ్చిపెడుతోంది.

166.15 ఎకరాల విస్తీర్ణంలో ఉప్పుగల్లీలుగా పిలవబడే గయాలు, ఉప్పు పత్ర భూముల్ని ఏపీఐఐసీకి బదలాయించాలని ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. జూలై 9వ తేదీన అచ్యుతాపురం తహసీల్దార్ పేరుతో వచ్చిన నోటీసుల సారాంశం మేరకు పంచాయతీ ఆమోదం తెలిపి సదరు భూముల బదలాయింపు సమాచారం ప్రజలకు తెలపాలని సూచించింది. దీనిపై ఆగస్టు మొదటి వారంలో పంచాయతీ సమావేశం భూముల బదలాయింపు వద్దని నిర్ణయించింది.

ఉప్పు గల్లీలకు, ఊరుకీ ముప్పే...

1955లో ఈ ప్రాంతంలో ఉప్పు తయారీ ప్రారంభించారు. వందలాది మంది మత్స్యకార మహిళలు ఉప్పు గల్లీలో పనిచేసేవారు. 2003 సంవత్సరంలో లీజుకి తీసుకున్న వారు లీజు చెల్లించడం ఆపివేయడంతో ఈ అంశం కోర్టు వరకూ వెళ్లింది. తర్వాత టీడీపీ ప్రభుత్వం హయాంలో లీజులను నిలిపివేయడంతో ఉప్పు తయారీ నిలిచిపోయింది. ఆ సమయంలో మహిళలు కొందరు పలు గ్రామాల్లో ఉప్పుని విక్రయించేవారు. ప్రస్తుతం కొందరు షెడ్యూల్ కులాలకు చెందిన వారు కొద్దిపాటి ఉప్పు తయారీ చేపడుతున్నట్టు సమాచారం. 2015 నుంచి ఉప్పు గల్లీలలో కార్యకలాపాలు నిలిచిపోవడం, తర్వాత సెజ్ పరిశ్రమలు రావడంతో ఈ భూమి ద్వారా వరద నీరు వర్షాకాల సమయంలో మళ్లించి ఉపద్రవాలను తప్పించేందుకు దోహదపడుతుంది. సీతపాలెం బీచ్‌కు ఆనుకొని ఉన్న మొగ నుంచి వచ్చే నీరు ఉప్పుటేరు మీదుగా ఉప్పుగల్లీ ప్రాంతాల మీదుగా అవసరమైనప్పుడు రెండవ ప్రాంతం వైపు గల గట్టుని తాత్కాలికంగా తవ్వి నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. తద్వారా పూడిమడక గ్రామానికి వచ్చే నీటి ముంపు ప్రమాదం నుంచి బయటపడేందుకు ఉప్పు గల్లీ భూములు దోహదపడేవి.



ఉప్పుటేరులో మృత్యువాతకు గురైన చేపలు

ప్రస్తుతం అస్తవ్యస్తంగా మిగిలిన ఫిషింగ్ హార్బర్ పనుల కారణంగా ఉప్పుటేరుని కుదించేశారు. ఉప్పుటేరు మీదుగా చిన్నపాటి సిమెంట్ గొట్టాలు వేసి రోడ్డుని వేయడంతో రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇటు ఉప్పుగల్లీ భూముల బదలాయింపు, మరో వైపు ఉప్పుటేరు ఉనికికి భంగం కలిగే పరిణామాలతో పూడిమడకకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

విష వలయంగా ఉప్పుటేరు

తాజాగా పూడిమడక ఉప్పుటేరులో చేపలు మృత్యువాతకు గురయ్యాయి. సెజ్‌లోని కొన్ని కర్మాగారాల్లో శుద్ధి చేయని రసాయనాలను ఉప్పుటేరులోకి వదలడం వల్లే చేపలు మృత్యువాతకు గురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరి గంగ పుత్రుల విషయంలో ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తో వేచి చూడాలి.

క్లుప్తంగా

యూరియాకు అధిక ధరలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి

● రైతులకు స్పీకర్ సూచన

నర్సీపట్నం : యూరియా కొరతపై నియోజక వర్గ రైతులు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని ఆశ్రయించారు. యూరియా బస్తాపై అసలు ధర కంటే అదనంగా రూ.30 వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని స్పీకర్ పేర్కొన్నారు. వ్యాపారులు అదనపు వసూళ్లు చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ కార్యదర్శికి ఫోన్ చేసి జిల్లాకు 3 వేల టన్నుల యూరియాను అత్యవసరంగా వంపించాలని కోరినట్టు ఆయన తెలిపారు.

23న తిమ్మరాజుపేటలో ఉద్యోగమేళా

అనకాపల్లి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మునగపాక మండలం తిమ్మరాజుపేట గ్రామం డా విస్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈనెల 23వ సుమారుగా 20 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్. గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9492429425ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ హెల్పర్‌కు గాయాలు


చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

మునగపాక : మండలంలోని చూచుకొండకు చెందిన విద్యుత్ శాఖ హెల్పర్ దాడి శ్రీనివాసరావు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసరావు విద్యుత్ శాఖలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం గణపర్తి–జోగారావుపేట పరిధిలోని విద్యుత్ వైర్లు సరిచేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కిందపడిపోయాడు. స్థానికులు అతనిని అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావు అక్కడ వైద్య చికిత్సలు పొందుతున్నారు.

మెగా లోక్ అదాలత్ విజయవంతం చేయండి

విశాఖ లీగల్ : వచ్చే నెల 13వ తేదీ జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సమావేశ మందిరంలో ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు ప్రాంతాల్లోని పోలీసు ఎక్సైజ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర శిక్షాస్మృతి పరిధిలోని రాజీ కాగలిగిన అన్ని కేసులను పరిశీలించాలని కోరారు. ఉభయ పక్షాలకు అంగీకారమే రీతిలో కేసులను రాజీ చేసి కక్షిదారులకు లబ్ధి చేకూర్చే విధంగా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో అన్ని ప్రాంతాలకు చెందిన పోలీస్ అధికారులు ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రైలులో లగేజీ మరింత భారం



- విమానాల తరహాలో వాతపెట్టేందుకు సిద్ధం
- ఎప్పట్నుంచో ఆంక్షలున్నా.. ఇక పక్కాగా అమలు
- ఫస్ట్ ఏసీ ప్రయాణికులకు 70 కిలోలే గరిష్టం
- స్లీపర్ క్లాస్ అయితే 40 కిలోలు దాటితే జరిమానా
- ఎక్కువ బరువు ఉంటే.. ముందుస్తు బుకింగ్ అవసరం
- లేదంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ కట్టాల్సిందే.!
- బ్యాగ్ పెద్దదైనా బాదుడు తప్పదు

సాక్షి, విశాఖపట్నం: రైలు ప్రయాణం..అన్నీ సర్దేసుకుని పట్టేసుకుందాం. సీటు కింద బ్యాగులు ఇష్టం వచ్చినట్లు పెట్టేసుకుందాం అంటే కుదరదిక. మీ లగేజీ.. మీకు మరింత భారమవ్వనుంది. ఇకపై రైలులో ప్రయాణికుల లగేజీని విమాన ప్రయాణంలో మాదిరిగా బాదుడు షురూ చెయ్యనున్నారు. ఎప్పటి నుంచే ఈ నిబంధనలున్నా.. ఇకపై తూ.చ. తప్పకుండా అమలు చెయ్యాలని నిర్ణయించారు. నిర్దేశించిన బరువు కంటే ఎక్కువ లగేజీ ఉంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ పడనుంది. సీటు కంటే బ్యాగ్ సైజ్ పెద్దదైనా బాదుడు తప్పదని రైల్వే శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మధ్యతరగతి ప్రయాణికులపైనే అధిక భారం మోపేందుకు రంగం సిద్ధమైంది. ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లో 70 కిలోల వరకూ అనుమతి ఉండగా సెకెండ్ క్లాస్ ప్రయాణికులకు కేవలం 40 కిలోల పరిమితికి మాత్రమే అనుమతించనున్నారు.

విమానం ఎక్కేందుకు వెళ్లే ప్రయాణికుల లగేజీ బరువు కొలిచే పద్ధతి అమల్లో ఉంది. ఇప్పుడు రైలు ప్రయాణికులకూ అదే విధానం అమల్లోకి రాబోతోంది. ఇకపై లగేజీ కొలిచే విధానం రైల్వే స్టేషన్లలో కూడా ప్రారంభం కానుంది. కొత్త నిబంధనల ప్రకారం, ప్యాసింజర్లు తమ లగేజీని రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్లలో తనిఖీ చేయించుకోవాలి. రైల్వే శాఖ ప్రతి కోచ్‌కు నిర్దిష్ట లగేజీ బరువు పరిమితులను నిర్ణయించింది. నిర్దేశించిన బరువు మించితే అదనపు చార్జీలు, జరిమానాలు చెల్లించాల్సిందేనంటూ ఇండియన్ రైల్వేస్ కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. భారతదేశంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు రైలులో ప్రయాణిస్తారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే బోర్డు చెబుతున్నా.. ఈ నూతన నిబంధనలు.. ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టబోతున్నాయి.

మధ్యతరగతిపైనే అధిక భారం

ఈ నిబంధనలు గతంలో ఉన్నవే అయినా.. ఇకపై కచ్చితంగా అమలు చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు రైల్వే కోచ్ ప్రకారం నిర్ణయించారు. ఇందులో మధ్యతరగతి ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణించే సెకెండ్‌క్లాస్, థర్డ్ ఏసీ పైనే భారం ఎక్కువగా ఉండనుంది. ప్రయాణికుల తరగతిని బట్టి ఉచిత లగేజీ పరిమితిని నిర్ణయించారు. దీని ప్రకారం, ఫస్ట్ ఏసీ ప్రయాణికులు 70 కిలోల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. సెకండ్ ఏసీ ప్రయాణికులు 50 కిలోలు, థర్డ్ ఏసీ ప్రయాణికులు 40 కేజీల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు కూడా కేవలం 40 కిలోలు మాత్రమే పరిమితి విధించవచ్చు. జనరల్, సెకండ్ సిట్టింగ్ ప్రయాణికులకు కేవలం 35 కిలోల వరకు ఉచిత పరిమితి విధించారు. రైల్వే నిబంధనల ప్రకారం.. నిర్దేశించిన పరిమితి కంటే 10 నుంచి 15 కిలోల వరకు ఎక్కువ లగేజీని తీసుకెళ్లడంలో సడలింపు ఉంటుంది. కానీ బరువు అంతకంటే ఎక్కువగా ఉంటే, ప్రయాణికులు స్టేషన్‌కు వెళ్లి లగేజీని బుక్ చేసుకోవాలి. ఒకవేళ ప్రయాణికుల్లో 5 నుంచి 12 ఏళ్ల వయసున్న వారు ఉన్నట్లైతే అనుమతించిన దానిలో సగం లగేజీని తీసుకెళ్లేందుకు అవకాశం ఉంది.

లగేజీ పరిమితి ఇలా...

క్లాస్	ఉచిత పరిమితి	ఉచిత సడలింపు	గరిష్టం
ఫస్ట్ ఏసీ	70 కిలోలు	15 కిలోలు	150 కిలోలు
సెకెండ్ ఏసీ	50 కిలోలు	10 కిలోలు	100 కిలోలు
థర్డ్ ఏసీ	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
స్లీపర్ క్లాస్	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
జనరల్/సెకెండ్ సిట్టింగ్	35 కిలోలు	10 కిలోలు	70 కిలోలు

బ్యాగ్ సైజ్ పెరిగినా వాత పడుద్ది

నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ తీసుకెళ్లినందుకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఒక ప్రయాణికుడు బుకింగ్ పరిమితి కంటే ఎక్కువ లగేజీని తీసుకెళ్తున్నట్లు తేలితే.. సాధారణం కంటే 1.5 రెట్లు అధికంగా జరిమానా విధిస్తారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రయాణ సమయంలో ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు మాత్రమే కాకుండా బ్యాగ్ పరిమాణం పైనా భారం పడనుంది. ప్రయాణికుల బ్యాగ్ చాలా పెద్దదిగా ఉండి, కోచ్‌లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే, దానిపైనా జరిమానా విధించే అవ



కాశం ఉందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. అంటే బరువు తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సైజు బ్యాగ్ పట్టుకెళ్లినా భారం తప్పదన్న విషయం ప్రయాణికులు గుర్తుపెట్టుకోవాలి. అంటే బుకింగ్ లేకుండా పరిమితి కంటే ఎక్కువ బరువు తీసుకెళ్లడం ఇక జేబుకు చిల్లు పడటమేనని ప్రయాణికులు వాపోతున్నారు. కొందరు ప్రయాణికులు పరిమితికి మించి లగేజీ తీసుకెళ్తుండటం వల్ల తోటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకపై ఈ సమస్య లేకుండా ఉండేందుకే నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. వృద్ధుల చేతి కర్రలు, హ్యాండ్ బ్యాగులు, టిఫిన్ బాక్సులపై ఈ లగేజీ పరిమితి వర్తించదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ నిబంధనలు తొలుత ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లోని ప్రధాన స్టేషన్లైన ప్రయాగ్‌రాజ్ జంక్షన్, కాన్పూర్ సెంట్రల్, అలీగఢ్ జంక్షన్ మొదలైన జంక్షన్లలో అమలుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే మిగిలిన స్టేషన్లలో అమలు చేయనున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు.

భారీ చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

72 తులాల బంగారం, రూ. 9.04 లక్షలు స్వాధీనం

అల్లిపురం: శీలానగర్‌లోని విజయ దుర్గ పాలిమర్స్ కంపెనీ యజమాని ఫ్లాట్‌లో ఈ ఏడాది జూలై 13న జరిగిన దొంగతనం కేసును నగర క్రైం పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 72 తులాల బంగారు ఆభరణాలు, రూ.9.04 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం డీసీపీ కె. లతామాధురి ఈ కేసు వివరాలను వెల్లడించారు. శీలానగర్‌లోని వేంకటేశ్వర కాలనీ, లక్ష్మి అపార్ట్‌మెంట్‌లో సప్పనాగమణి కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆమె ఫ్లాట్‌లో పాలిషింగ్ పనులు జరుగుతుండటంతో.. జూలై 12న రాత్రి 10.30 గంటలకు తన భర్త, చిన్న కూతురుతో కలిసి కింద ఫ్లోర్‌లోని మరో ఫ్లాట్‌లో నిద్రపోయారు. జూలై 13న తెల్లవారుజామున 4.25 గంటలకు తిరిగి తమ ఫ్లాట్‌కు రాగా.. ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపల బీరువా లాకర్ కూడా పగలగొట్టి ఉండగా.. అందులో ఉన్న సుమారు 100 తులాల బంగారు ఆభరణాలు, రూ. 13.5 లక్షల నగదు కనిపించలేదు. దీనిపై ఆమె గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన క్రైం పోలీసులు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అర్జున జ్ఞాన ప్రకాష్, లింగిబెడి రాంబాబులు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. వీరు తెలంగాణ రాష్ట్రం మలకపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్య కేసులో నిందితులుగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. సౌత్ జోన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం మలక్‌పేట వెళ్లి నిందితులను విచారించింది. విచారణలో నర్సీపట్నం, అయ్యన్న కాలనీ, పీనరిపాలెం ప్రాంతానికి చెందిన చిటికల నాగేశ్వరరావు అలియాస్ నాగేష్ ఈ దొంగతనానికి సూత్రధారి అని తేలింది. సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు గాజువాక బి.సి.రోడ్డులోని మసీదు వద్ద నాగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడితో పాటు చంచల్‌గూడ జైలు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చిన ఆ ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దొండపూడిలో ఘనంగా దుర్గాలమ్మ పండగ


జాతరలో పాల్గొన్న మాజీ మంత్రులు రోజా, అమర్‌నాథ్, తదితరులు

రావికమతం: దొండపూడి గ్రామ ఆరాధ్య దైవం దుర్గాలమ్మ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రులు ఆర్.కె.రోజా, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, చింతలపూడి వెంకట్రామయ్య, అనకాపల్లి జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, చోడవరం ఎమ్మెల్యే రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ మంత్రి వీరభద్రరావు, ప్రభుత్వ విప్ గణబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ తీగ తెగి పడి ఇద్దరు మృతి

బైక్‌పై వస్తుండగా వెంటాడిన మృత్యువు


ఇద్దరి మృతదేహాలు

జి.మాడుగుల: విద్యుత్ తీగ తెగిపడటంతో బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు షాక్‌కు గురై మృతి చెందారు. బొయితిలి– మద్దిగరువు గ్రామాల మధ్య గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి ప్రాంతం నుంచి ట్రాలీపై కాంక్రీట్ మిల్లర్‌ను తీసుకువస్తున్నారు. ఈ సమయంలో బొయితిలి– మద్దిగరువు మధ్యకు వచ్చేసరికి విద్యుత్ లైన్ తగిలింది. దీంతో తీగ తెగి ట్రాలీ వెనుక బైక్‌పై వస్తున్న ఇద్దరిపై పడింది. దీంతో వారు తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతులు నర్సీపట్నానికి చెందిన వారుగా స్థానికులు భావిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

నేలబావిలో జారిపడి యువకుడి మృతి


మృతి చెందిన కటారి రాజేష్(23)

యలమంచిలి రూరల్ : పట్టణానికి సమీపంలో గురువారం శేషుగెడ్డ వద్ద నేల బావిలో జారిపడి కటారి రాజేష్(23) అనే యువకుడు మృతి చెందాడు. కొంకోట మండలం నర్సింగబిల్లి జంగాల కాలనీకి చెందిన రాజేష్, స్నేహితుడు కట్టుమూరు మధుతో కలిసి చేపలు పట్టడానికి 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన శేషుగెడ్డ వద్ద కొబ్బరి తోటలో ఉన్న నేల బావి వద్దకు వచ్చారు. చేపలకు గాలం వేసిన సమయంలో కటారి రాజేష్ ప్రమాదవశాత్తూ బావిలోకి జారి పడ్డాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న కటారి రాజేష్ తండ్రి, కుటుంబ సభ్యులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని కుమారుడి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం


శారదానదిలో లభించిన మహిళ మృతదేహం

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం సమీపంలోని శారదానదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉండగా క్షుణ్ణంగా పరిశీలించి పలు ఆధారాలు సేకరించారు. మృతురాలి వయస్సు 50 నుంచి 60 వరకు ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం కుడి చేతిపై జె.రాజులమ్మ అని తెలుగులో పచ్చబొట్టు, ఎడమ చేతి మధ్య వేలికి పగడపు పొడితో కూడిన రాగి ఉంగరం ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతురాలికి సంబంధించి వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్, ఫోన్ నెంబర్ 9440796092కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ఉచిత బస్సుకోసం పాట్లు..ఫీట్లు


అడ్డురోడ్డు బస్సుకోసం ఎదురు చూస్తున్న మహిళలు

ఎస్.రాయవరం : ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన ఫ్రీ బస్ ఎక్కేందుకు మహిళలు క్యూ కట్టారు. అడ్డురోడ్డు బస్టాండ్‌లో సుమారు 15 మందికి పైగా బస్సు కోసం ఎదురు చూస్తుండగా స్థానిక ఆటో డ్రైవర్లు వీడియో తీసి సోషల్ మీడియాల్లో హల్‌చల్ చేశారు. ఈ సమయంలో జంక్షన్‌లో విక్రయించుకునేందుకు తెచ్చుకున్న కుర్చీలపై వరుసలో కూర్చుని బస్సుల కోసం వేచి చూశారు. బస్సు రాగానే కిక్కిరిసిన బస్సులో ఎక్కి సీట్లు కోసం ఎగబడ్డారు. కగా మహిళలకు ఉచిత బస్సు పథకం తమను తీవ్రంగా దెబ్బకొడుతోందని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


చెట్టును ఢీకొట్టిన బ్రాండిక్స్ బస్సు

మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురంలో గురువారం మధ్యాహ్నం ప్రమాదం త్రుటిలో తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు బస్సు చెట్టును ఢీకొట్టింది. వివరాలిలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ కంపెనీలో విధులు పూర్తి చేసుకొని బస్సులో వస్తున్నారు. పల్లపు ఆనందపురం సమీపంలోకి వచ్చే క్రమంలో డ్రైవర్ ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించేందుకు చెట్టును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బస్సు ముందున్న అద్దాలు పగిలిపోయాయి. బస్సులో ప్రయాణిస్తున్న ఉద్యోగులు ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బెదిరింపులపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: తనను కొట్టి, చంపుతానని బెదిరించినట్లు వెంకటలక్ష్మి అనే మహిళ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. టౌన్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుమ్మపాల రెవెన్యూ పరిధిలో 76 సెంట్ల భూమి వద్దాది పృథ్వీరాజ్ పేరు మీద ఉందని, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి నానిబిల్లి నాగేశ్వరరావు కూడా ఆ భూమి తనకే చెందుతుందని కోర్టుకు వెళ్లడంతో పృథ్వీరాజ్‌కు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని ఎస్ఐ తెలిపారు. ఈ క్రమంలో పృథ్వీరాజ్‌కు తెలియకుండా నాగేశ్వరరావు ఆ భూమిలో వరినాట్లు వేశాడన్నారు. దీనిపై పృథ్వీరాజ్ తల్లి వెంకటలక్ష్మి వెళ్లి అడగంతో నాగేశ్వరరావు బెదిరింపులకు పాల్పడ్డాడని, ఈ మేరకు ఆమె గురువారం పట్టణ పోలీసులను ఆశ్రయించిందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృతుల పేరిట ఉపాధి వేతనాల చెల్లింపు

- బుచ్చెయ్యపేట మండలంలో విడ్డూరం
- సోషల్ ఆడిట్‌లో బట్టబయలు


బుచ్చెయ్యపేటలో రాత్రి వరకు జరుగుతున్న సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న అధికారులు

బుచ్చెయ్యపేట: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో లక్షలాది రూపాయల అవినీతి జరిగినట్టు సోషల్ ఆడిట్‌లో తేలింది. గురువారం బుచ్చెయ్యపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఈ వ్యవహారం బయట పడింది. పలు గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు పక్కదారి పట్టినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది వివరించారు. రాజాం గ్రామంలో మృతి చెందిన యాదగిరి మాణిక్యం 36 రోజులు ఉపాధి పనులు చేయగా రూ, 10,800, మోటూరి రవిబాబు 8 రోజులు పని చేయగా రూ, 2,400 పేమెంట్లు చేసినట్లు గుర్తించామని సోషల్ ఆడిట్ సిబ్బంది వెల్లడించారు. ఆర్.శివరాంపురంలో బోయిన భూలక్ష్మి పనికి వెళ్లకపోయినా ఆమె పేరు మీద రూ,15,600 నగదు డ్రా చేశారు. గంటికొర్లాంలో వీఆర్పీ ఉపాధి పనులకు వెళ్తున్నట్లు మస్టర్లు వేయడమే కాక ఆమె భర్త పేరు మీద గ్రామంలో మొక్కలకు వాటరింగ్ చేసినట్లు రూ. 42 వేలు డ్రా చేశారన్నారు. గ్రామంలో 400 మొక్కలు నాటినట్లు రికార్డులు చూపగా.. సోషల్ ఆడిట్‌లో 174 మొక్కలు మాత్రమే ఉన్నట్లు గుర్తించామన్నారు. గంటికొర్లాం వీఆర్పీ గతంలో జరిగిన మూడు, నాలుగు సోషల్ ఆడిట్‌లో లక్ష రూపాయల వరకు నిధులు పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. పలు గ్రామాల్లో తవ్వించిన ఫారం పాండ్స్ కొలతల్లో తేడాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు సోషల్ ఆడిట్‌ను అధికారులు నిర్వహించారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో భానోజీరావు, ఏపీవో వరహాలు బాబు, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఎనిమిది మంది అరెస్ట్


గంజాయి నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, సిబ్బంది

- రూ.15 లక్షలు విలువ చేసే సరకు స్వాధీనం
- రెండు కార్లు, బైక్ సీజ్

నర్సీపట్నం: గంజాయి అక్రమ రవాణా కేసులో ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని, వీరిలో మైనర్ బాలుడు ఉన్నాడని డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటకకు చెందిన మహ్మది నిజాముద్దీన్(25), సంతోష్(35), చింతపల్లి మండలం, మేడూరు గ్రామానికి చెందిన వంతల బుజ్జిబాబు(30), చిన్నగెడ్డ గ్రామానికి చెందిన వంతల కార్తికేయ(22), 16 ఏళ్ల గిరిజన బాలుడు, ఒడిశాకు చెందిన హరిఖర(20), కారు డ్రైవర్ కర్ణాటకకు చెందిన సిద్దేష్(25), కారు యజమాని నయీం(45) గంజాయి తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు కార్లు, బైక్ సీజ్ చేశామన్నారు. ముందుస్తు సమాచారం మేరకు రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్సైలు రాజారావు, రామారావు, సిబ్బంది కె.కొండబాబు, ఎస్.త్రిమూర్తులు, దేవేంద్ర గురువారం నర్సీపట్నం మండలం, రెట్టవానిపాలెం శివారులో మాటువేసి, బైక్‌పై వస్తున్న పైలెట్‌ను అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ తెలిపారు. కారు అడుగు భాగంలో ప్రత్యేక అర తయారు చేయించి గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. రూ.15 లక్షలు విలువ చేసే 66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని జువైనల్ హోంకు తరలించామన్నారు.

గంజాయి కేసులో నలుగురికి పదేళ్ల జైలు

చోడవరం: గంజాయి కేసులో నలుగురు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు గురువారం తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2015 మార్చి 12న చీడికాడ మండలం కోనాం సమీపంలో గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు తనిఖీల్లో నలుగురు నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి 120 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఎస్ఐ డి.విశ్వనాథం కేసు నమోదు చేశారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న చీడికాడ మండలం బైలపూడికి చెందిన జాజిమొగ్గల రమణ, దారపు మాణిక్యం, జాజిమొగ్గల నూకరాజు, కిరణంపల్లి భూలోకను అరెస్టు చేశారు. చోడవరం 9వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఈ కేసులో వాదనలు విని, వారిపై నేరం రుజువు కావడంతో నిందితులకు శిక్ష ఖరారు చేశారు. నలుగురు ముద్దాయిలకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో రెండున్నరేళ్ల జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్రావు అన్ని వివరాలు కోర్టుకు అందించడంతో నేరం రుజువైందన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తత

- వర్షాలతో దోమల విజృంభణ
- ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ముప్పు..



రైల్వే స్టేషన్ రహదారిలో టైర్లలో నిల్వ నీటిని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



గాంధీనగరంలో డ్రమ్‌లో నిల్వ నీటిని తొలగిస్తున్న జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది



రింగ్‌రోడ్డు లక్ష్మీనారాయణనగర్‌లో కాలువలో స్ప్రేయింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

అనకాపల్లి: వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. ఒక పక్క వర్షం మరో పక్క అత్యధిక ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురికావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. వర్షాకాలంలో డెంగ్యూదోమ విజృంభిస్తుంది. ప్రాణాంతకమైన డెంగ్యూ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటంతోపాటు, మంచినీటి నిల్వలు లేకుండా నిత్యం జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ సూచిస్తుంది. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించవచ్చును.

అనకాపల్లి పట్టణం, మండల పరిధిలో మొత్తం 53 సచివాలయాల పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు మాసంలో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశాలు ఉన్నందున్న ప్రజలు ఎక్కువగా విషజ్వరాలు బారిన పడుతుంటారు. జ్వరమే కదా అని అశ్రద్ధ చేస్తే మనిషి ప్రాణానికే ప్రమాదం వాటిల్లనుంది.

ప్రస్తుతం ఏడాది పట్టణ, మండల పరిధిలో డెంగ్యూ దోమతో నేటికి ఒక వ్యక్తి మృతి చెందలేదు. గతేడాది పట్టణ, మండల పరిధిలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.

ఏడీస్ ఈజిప్ట్ దోమతో డెంగ్యూ...

ఏడీస్ ఈజిప్ట్ దోమలు కుట్టడంతో మనిషికి డెంగ్యూ వైరస్ సోకుతుంది. ఆడ ఏడిస్ ఈజిప్ట్ దోమకాటు పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఈ జాతి దోమపైన నల్లని, తెల్లని చారలు ఉండడంతో వీటిని టైగర్ దోమలు అని పిలుస్తారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటూ పగటివేళల్లో మాత్రమే మనిషిని కాటు వేస్తాయి. అన్ని రకాల దోమల కంటే డెంగ్యూ దోమ బరువుగా ఉండడంతో 400 మీటర్ల కంటే ఎక్కువ దూరం ఎగరలేని స్థితిలో ఉంటుంది. దోమలోనే కాకుండా వాటి గుడ్లలోనూ వైరస్ ఉంటుంది. ఈ డెంగ్యూ దోమలు కేవలం మంచినీటి నిల్వలో మాత్రమే గుడ్లు పెడుతూ విస్తృతంగా పెరుగుతాయి.

లక్షణాలు..

ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ల నొప్పులు, కళ్ల నొప్పులు ఉంటుంది, ఒక్కోసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, అధికం దాహం, నోరు తడారిపోవటం వంటివి లక్షణాలు ఉంటాయి. డెంగ్యూ వ్యాధి మూడు రకాలుగా ఉంటాయి. డెంగ్యూ జ్వరం, డెంగ్యూ హేమరేజ్ జ్వరం, డెంగ్యూ పాక్‌సిండ్రోమ్‌గా, డెంగ్యూ దోమకాటు అనంతరం 3 నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. డెంగ్యూ సోకిన అనంతరం సాధారణంగా 80 శాతం మంది దానంతట అదే తగ్గిపోతుందని వైద్యులను సంప్రదించరు. కానీ వ్యాధి తీవ్రతతో రక్తంలోని ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు మాక్ ఎలిసా పరీక్షలు చేయించుకోవాలి.

పరిసరాలు పరిశుభ్రత పాటించాలి...

డెంగ్యూ దోమలు విజృంభించకుండా గృహాలు, పరిసరాల్లోనూ పరిశుభ్రత పాటించాలి. మంచినీటి నిల్వలపై తప్పకుండా మూతలు పెట్టుకోవాలి. వారానికి ఒకసారి కచ్చితంగా డ్రైడే ఫ్రైడే పాటిస్తూ నీటి తొట్టిలు, పూలమొక్కలు, టైర్లు, ట్యూబ్‌లు, ఇతర పరికరాల్లో నీటిని నిల్వ లేకుండా చూడాలి. ఇంటి ఆవరణలో బంతి, పుదీనా మొదలైన మొక్కలు నాటడం వల్ల డెంగ్యూ దోమలను నివారించే అవకాశం ఎక్కువగా ఉంది. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించుకోవాలి. కొబ్బరి బొండాలు, ఎయిర్ కూలర్ల వెనుక శుభ్రం చేస్తూ ఉండాలి.

జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దు



జర్వం వచ్చిన వెంటనే దగ్గరలో వైద్యుల సూచనలు మేరకు మందులు వాడాలి. రక్తపరీక్షలు, డెంగ్యూ మలేరియా, ఇతర పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాణహాని ఉండదు. చాలామంది వ్యక్తులు జ్వరం వచ్చిన రెండు, మూడు రోజులు తర్వాత వైద్యులను సంప్రదిస్తారు. అలా చేయడం మంచిది కాదు. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో సచివాలయ ఏఎన్ఎంలను కలిసి వారి సూచనలు మేరకు వైద్యులను సంప్రదించాలి. అన్ని జ్వరాలు ఒకే రకంగా ఉండవు.

– వాణీజగదీశ్వరి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు, అనకాపల్లి మండలం

క్లుప్తంగా

డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తం చేయండి



మాట్లాడుతున్న జీవీఎంసీ జోనల్ కమిషనర్

అనకాపల్లి టౌన్: డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి సూచించారు. పట్టణంలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో ఎస్‌హెచ్‌జీ, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నెల రోజులు పాటు నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు తగిన సూచనలు చేయాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎస్ఎస్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుధ్య కార్మికులకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి టౌన్: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని జీవీఎంసీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత పేర్కొన్నారు. పట్టణంలోని జీవీఎంసీ 82వ వార్డు పరిధిలో పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ నిధులతో ఒక్కొక్కరికి 4 జతల పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎస్ఎస్ రవికుమార్, ఇన్‌స్పెక్టరు గణేష్, కార్మికులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త ఫైబర్ బేసిక్ టీవీ ప్లాన్



సమావేశంలో మాట్లాడుతున్న పాల్ ఐలియమ్స్

అనకాపల్లి: బీఎస్ఎన్ఎల్ కొత్తగా తీసుకొచ్చిన ఫైబర్ బేసిక్ టీవీ ప్లాన్(ట్రిపుల్ ప్లే సర్వీస్–టీవీ చానల్స్, ఓటీటీలు, అన్ లిమిటెడ్ ఫ్రీ ఫోన్ కాల్స్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ విశాఖ ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ పాల్ ఐలియమ్స్ కోరారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో గురువారం రాత్రి అనకాపల్లి, పరవాడ, అచ్యుతాపురం, చోడవరం, యలమంచిలి మండలాల కేబుల్ ఆపరేటర్లతో ఫైబర్ బేసిక్ టీవీ ప్లాన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఓఎఫ్‌సీ నెట్‌వర్కుని ఉపయోగించుకుని బీఎస్ఎన్ఎల్ సేవలను పొందాలన్నారు. బీఎస్ఎన్ఎల్ పీజీఎం ఆడమ్స్, డీజీఎంలు జగదీశ్వర రావు, బేగం, ఏజీఎం నావెల్ కిషోర్, డీఈ గోపినాథ్, డీఈ రమేష్ పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి



ఏపీ గో సంరక్షణ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: జిల్లాలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోందని, అందుకు బాధ్యులను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఏపీ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న పశువుల సంతలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కబేళాలపై చర్యలు తీసుకోవాలన్నారు. గో సంరక్షణకు గోశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గో సంరక్షణ జిల్లా కమిటీని 16 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మళ్రా అనిల్ కుమార్ ఎంపికయ్యారు. దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొణతాల అప్పలరాజు, కేవీఆర్ సత్యనారాయణ, నీలపు దేవి, చింతలపూడి రూపవతి, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 351 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయం

నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్: అన్యాయంగా అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. స్థానిక రింగ్‌రోడ్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ప్రతీ సమస్యపై ప్రజల పక్షాన నిలవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఏవీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, 80, 84 వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం. నాయుడు, కోరుకొండ రాఘవ, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు జ్ఞానదీప్, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

అరకొర బస్సులతో మహిళలకు ఇబ్బందులు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు ప్రభావతి

అనకాపల్లి టౌన్: సూపర్ సిక్స్‌లో భాగంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంలో అరకొర బస్సులతో మహిళలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, తక్షణమే వాటి సంఖ్యను పెంచాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నారులు లైంగిక వేధింపులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ పేరుతో మోసం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, సూర్యప్రభ, యు. నాగమణి, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో కనకమహాలక్ష్మి





గాజుల పూజకు హాజరైన భక్తులు

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి గాజుల పూజ ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా భక్తులు సమకూర్చిన గాజులతో వేద మంత్రాల నడుమ అర్చకుడు వి.కృష్ణ పూజలు చేశారు. గాజుల మధ్య అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. లలితా సహస్ర నామ పారాయణ, భక్తి పాటలు ఆలపించారు. చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు అర్చకుడు తెలిపారు.

రాత్రి 8 తర్వాతే లారీల లోడింగ్, అన్‌లోడింగ్

పట్టణ కిరాణా వ్యాపారులకు డీఎస్పీ శ్రావణి సూచన



పట్టణ వర్తకులతో డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్: వ్యాపారులంతా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని డీఎస్పీ శ్రావణి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ అతిథి గృహంలో పట్టణ హోల్‌సేల్ కిరాణా, ఆయిల్, ట్రాన్స్‌పోర్ట్, కాయగూరలు, బట్టల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్తకులు తమ సరుకులు తీసుకువచ్చే లారీలతో రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల లోపు మాత్రమే లోడింగ్, అన్‌లోడింగ్ ఆయా షాపుల వద్ద చేసుకోవాలన్నారు. మిగిలిన సమయాల్లో లారీలు రోడ్లపై కనిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి కొంతమంది వర్తకులు కల్పించుకుని మధ్యాహ్నం వేళ సరుకుల లోడింగ్, అన్ లోడింగ్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికే కాయగూరల మార్కెట్ వద్ద డీసీఎంస్ స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించామని, భారీ వాహనాలన్నీ అక్కడ నిర్దేశించిన సమయాల్లో మాత్రమే చేసుకోవాలని సమాధానమిచ్చారు. సమావేశంలో డీసీఎంస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పట్టణ, ట్రాఫిక్ సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం వెంకటనాయణ, క్రైం ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

‘డయల్ యువర్ ’ఏఈ నేడు

తుమ్మపాల: ఈ నెల 22న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తుమ్మపాల సెక్షన్ ఆఫీసులో డయల్ యువర్ ఏఈ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏపీ ఈపీడీసీఎల్ తుమ్మపాల సెక్షన్ ఏఈ దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. వినియోగదారులతో మరింత సమన్వయం పెంచేందుకు, గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తుమ్మపాల సెక్షన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై ఏఈ ఫోన్ నంబరు 8333811265కు, లైన్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబరు 7981842244కు కాల్ చేసి సమస్యలని తెలియపరిచినట్లయితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా తుమ్మపాల, మార్టూరు గ్రామాల వినియోగదారులు లైన్‌మన్ కే ప్రవీణ్‌కు ఫోన్ 7013860533కు, మామిడిపాలెం, మాకవరం , పాపయ్యసంత పాలెం, పాపయ్యపాలెం, ఉడేరు, ఎ.కె.పాలెం, దిబ్బపాలెం, దుడ్డుపాలెం గ్రామాల వారు లైన్‌మన్ ఆర్. శ్రీను ఫోన్ 8008120208కు, బవులవాడ, సుందరయ్యపేట, అచ్చియ్యపేట, మొండిపాలెం, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, జగన్నాధపురం, మెట్టపాలెం. గ్రామస్తులు లైన్‌మన్ ఎం. నాగరాజు ఫోన్ 9000816210కు కాల్ చేసి సమస్యలు తెలుపవచ్చన్నారు.

హై వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కశింకోట: స్థానిక గోవిందరావు కాలనీలో మూడు రోజుల క్రితం విద్యుత్ హై వోల్టేజీ సరఫరా రావడం వల్ల గృహోపకరణాలు కాలిపోయి నష్టం ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పలు ఇళ్లలో టీవీలు, లైట్లు, ఫ్రిజు వగైరా ఉపకరణాలు కాలిపోయాయని వాపోయారు. ఇకపై ఇటువంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా నల్లమారమ్మ పండగ

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం, శివారు త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం గ్రామాల్లో గురువారం నల్లమారమ్మ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారి ఆలయాన్ని దర్శించి చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు నిర్వాహకులు సింగిల్ విండో సిస్టం ద్వారా ఎస్‌హెచ్‌వో నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ శ్రావణి పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సింగిల్ విండోలో మండపం, మైక్, ఫైర్, పోలీస్, ట్రాఫిక్ తదితర అన్ని రకాల అనుమతులు లభిస్తాయన్నారు. డీజేలకు పరిమితికి మించి ఎక్కువ సౌండ్ పెడితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుపు ఉత్సవాల్లో ఎక్కడా అశ్లీల నృత్యాలు పెట్టరాదన్నారు. చవితి ఉత్సవాలను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలన్నారు. అనుమతులకు అనుగుణంగానే నిమజ్జనాలు చేసుకోవాలన్నారు. సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ, క్రైం ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

జిల్లాలో మైనింగ్ మాఫియాపై ఉద్యమిద్దాం

కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఓబీసీ రాష్ట్ర చైర్మన్ నాగరాజు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న శొంఠి నాగరాజు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో మైనింగ్ మాఫియా పెరిగిపోయిందని, ఖనిజ సంపదను కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ శొంఠి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్లో పార్టీ జిల్లా ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడా బాబులు, కొంత మంది ఎమ్మెల్యేలు కలసి జిల్లాను ముక్కలుగా చీల్చి నిరంతరం దోపిడీ చేస్తున్నారన్నారు. కొండలు, గుట్టలు, అడవులు నాశనం చేసి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని, ఈ దోపిడీతో జిల్లాలోని సామాన్య ప్రజలకు ఏ ఒక్క రూపాయ ఉపయోగం లేదన్నారు. ఈ అక్రమాల వెనుక ఉన్న వారి పేర్లు బహిరంగం చేస్తామని, ఇక ప్రజలు పక్షాన పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీసీలను ఓటు బ్యాంకులా వాడుకోవడం పాలకులకు అలవాటు అయిపోయిందన్నారు. ఎన్నికల హామీల అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో జిల్లాలో వివిధ మండలాల ఓబీసీ కో ఆర్డినేటర్లు రాము, ఆనంద్, నారాయణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల మానవహారం

కశింకోట: పింఛన్ల పంపిణీ, ఇతర అదనపు బాధ్యతలు అప్పగించొద్దని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ముందుగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించవద్దని శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, అనేక యాప్‌ల ద్వారా డేటా నమోదుతో పని భారం విపరీతంగా పెరిగిందని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో పింఛన్ల పంపిణీ తలకు మించిన భారంగా పరిణమిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిదృష్ట్యా అదనపు బాధ్యతలు అప్పగించకుండా విముక్తి కలిగించాలన్నారు. కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో ధర్మారావుకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ ప్రతినిధులు తనూజ, గంగవేణి, రజని, రమాదేవి, టి. శ్యామల, కుమారి, అమ్మాజీ, లక్ష్మి, వెంకటలక్ష్మి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మలసాల భరత్ కుమార్

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. ఈ నెల 24న జరిగే గవరపాలెం నాగేంద్ర సమేత వల్లి దేవసేన కల్యాణ సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం మొదటి వార్షికోత్సవ కరపత్రాన్ని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దేవస్థాన కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం గౌరవాధ్యక్షుడు దొడ్డి సత్యనారాయణ, చైర్మన్ రోషన్‌కుమార్, కోశాధికారి మద్దాల క్రాంతికుమార్, కమిటీ సభ్యులు పీలా రమణారావు, ఆళ్ల రాము పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి లోవరాజు



మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి లోవరాజు

కశింకోట: బాల బాలికలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి. లోవరాజు కోరారు. మత్తు పదార్థాలు, బాల్య వివాహాల నియంత్రణ ఆవశ్యకతపై కశింకోట, తాళ్లపాలెం హైస్కూళ్లు, కశింకోటలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలు 18 ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు చేసుకోవాలన్నారు. లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా, బాల కార్మికులు, బాలల భిక్షాటన నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాల బాలికల్లో స్నేహ పూర్వకమైన వాతావరణం నెలకొనేలా బాలల సంక్షేమ కమిటీలు, రక్షణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాళ్లపాలెం హైస్కూలు హెచ్ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు వేంకటేశ్వరరావు, కల్యాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓటు చోరీపై కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



నెహ్రూచౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అనకాపల్లి: దేశంలో వివిధ నియోజకవర్గాల్లో 5 విధాలుగా బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం సహాయంతో బీజేపీ ప్రభుత్వం ఓటర్ జాబితాలో చేర్పిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఏబీసీ చైర్మన్ శొంఠి నాగరాజు ఆరోపించారు. స్థానిక విజయరామరాజుపేట నుంచి నెహ్రూచౌక్ వరకూ ఓటు చోర్ గద్దీ చోడ్ నినాదంతో గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల తర్వాత వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గంపగత్తుగా బోగస్ ఓట్లు పడ్డాయన్నారు. వీటిని చేర్చి రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, జిల్లా నాయకులు పాల్గొన్నారు.